# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాలు ఈరోజు సాయంత్రం లోపు సాధారణ స్థితికి వస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **ఎన్టీఆర్ జిల్లాలో వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.**

**3.** **ప్రభుత్వం అందించే సాయాన్ని వరద ప్రభావిత గ్రామ పంచాయితీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**4.** **వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**5.** **తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఈరోజు.**

============================

విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాలు ఈ రోజు సాయంత్రం లోపు సాధారణ స్థితికి వస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరద సహాయక చర్యలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విజయవాడలో వరద సహాయక చర్యలు తుదిదశకు వచ్చాయని, ఈరోజు సాయంత్రంలోపు నగరంలో సాధారణ స్థితి నెలకొనాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఆ ప్రాంత మంత్రులకు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో మంత్రులు పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తూ నివేదికలను అందించాలని ఆదేశించారు.

-------------------------

భారీ వర్షాలు, వరదలకు ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన నష్టం అంచనాకు విధివిధానాల రూపకల్పన, ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ల-తో ఈ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ప్రభుత్వం అందించే సాయాన్ని వరద ప్రభావిత గ్రామ పంచాయితీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో వరద ప్రభావిత గ్రామ పంచాయితీలకు బాపట్ల పార్లమెంటు సభ్యులు టి. కృష్ణ ప్రసాద్‌తో కలిసి మంత్రి నిన్న చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలోని 5 మండలాల పరిధిలో 25 గ్రామ పంచాయితీలకు వరద సాయం కింద లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశామని తెలిపారు. ప్రభుత్వం అందించే నగదు గ్రామాల్లో సౌకర్యాలను తిరిగి పునరుద్ధరించుకోవడానికి వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో నిన్న మంత్రి మాట్లాడుతూ, విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 32 డివిజన్లలో 131కి పైగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ తదితర కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న ముందస్తు నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. వరద నీరు లేని ప్రాంతాలలోను ఏడు రోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సర్వే కోసం వార్డు సచివాలయ పరిధిలో ముగ్గురు ఆరోగ్య సహాయకులు, సూపర్వైజర్లు, పారిశుధ్య సిబ్బందిని నియమించినట్టు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

భారీ వర్షాలు, వరదల వలన నష్టపోయిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విజయవాడ కృష్ణలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించి ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయక చర్యల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ, వరద నష్టం అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ నివేదిక ప్రకారం ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గృహాలకు, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలకు జరిగిన నష్టాలను ప్రత్యేక యాప్లో నమోదు చేసి సహాయం అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎగువన కురుస్తున్న వర్షాలతో కాకినాడ జిల్లా ఏలేరు కాల్వకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఏలేరు జలాశయం నుంచి 27వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జిల్లాలోని 10 మండలాల పరిధిలోని 86 గ్రామాలు, కాలనీల్లోకి వరద నీరు చేరింది. ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నీటమునిగాయి. కిర్లంపూడి మండలం రాజుపాలెం, ఎస్ తిమ్మాపురం, గోపాలపట్నం, సుందరాయనపాలెం గ్రామాలు ఏలేరు వరద ముంపుకు గురైయ్యాయి. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గోపాలపట్నం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోనూ వరద ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. ఏలేరు వరద ప్రభావిత గ్రామాల్లో విద్యాసంస్థలకు అధికారులు ఈ రోజు సెలవు ప్రకటించారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రబృందం రేపు కృష్ణా జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ తెలిపారు. కేంద్ర బృందం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందంపర్యటించి, దెబ్బతిన్న వివిధరకాల పంటలు, రహదారులు, వంతెనలు పరిశీలించి వరద నష్టాన్ని అంచనా వేస్తుందని తెలిపారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని పవర్పాయింట్ ప్రజెంటేషన్, ఛాయా చిత్ర ప్రదర్శన ద్వారా వివరించేందుకు పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లాలో వర్షాల కారణంగా ఎటువంటి పంట నష్టం సంభవించ లేదని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రధాన నదులు వంశధార నాగావళి, మహేంద్ర తనయ, బహుదా నదుల్లో నీటి ప్రవాహం పెరుగుతోందని అన్నారు. మడ్డువలస, నారాయణపురం జలాశయాల్లో నీటి ప్రవాహం నిలకడగా ఉందని చెప్పారు. తీర ప్రాంత వాసులు ఆందోళన చెందవద్దని, రెండు రోజుల్లో మళ్లీ వేటకు వెళ్ళటానికి అనుమతి ఇస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామరావు తెలిపారు. ఇంద్రకీలాద్రి ఆలయానికి చెందిన అధికారులు, అర్చకులతో దసరా ఏర్పాట్లపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరావు మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలకు పనులను వేగవంతం చేయాలని సూచించారు.

---------------------------

తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి ఈరోజు. ఆయన సెప్టెంబరు 10, 1895వ సంవత్సరంలో కృష్ణాజిల్లా ఉంగుటూరు ప్రాంతంలోని నందమూరులో జన్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఆస్థాన కవిగా సేవలందించారు. ఎస్.ఆర్.ఆర్, సి.వి.ఆర్. కళాశాలలో తెలుగు ప్రధాన అధ్యాపకునిగా పనిచేశారు. “శ్రీమద్రామాయణ కల్పవృక్షము” రచనకు గాను తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకున్నారు. తన రచనలతో తెలుగు సాహితీ లోకాన్ని సుసంపన్నం చేసిన విశ్వనాథ సత్యనారాయణ 1976 అక్టోబర్ 18న తుదిశ్వాస విడిచారు.

---------------------------

చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజన పథకం అమలులో మెనూ మార్పులపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. ఇందులో భాగంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, కమిటీ సభ్యుల నుంచి మెనూ మార్పు పట్ల సలహాలు, సూచనలు రెండు రోజుల్లోపు

సేకరించాలని అధికారులకు సూచించారు.

-------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ నెల 14 నుంచి అక్టోబర్ 2 వరకు “స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత” పేరుతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అక్టోబర్ 2ను స్వచ్ఛ భారత్ దివస్‌గా నిర్వహిస్తున్నామని, జిల్లాలో స్వచ్ఛతా కార్యక్రమాల కోసం 15 మంది అధికారుతో ప్రత్యేక కమిటీని నియమించామని కలెక్టర్ తెలిపారు.

-------------------------

తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆలయశుద్ధి కార్యక్రమాన్ని ఈరోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా ఈ రోజు ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలకు ముందు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్నామని ఆలయ వేద పండితులు తెలిపారు.

-------------------------

రాజమహేంద్రవరం నగరంలో చిరుత సంచారంపై సామాజిక మాధ్యమాలలో ప్రచారం అవుతున్న అసత్య కథనాలను ప్రజలు నమ్మవద్దని స్థానిక శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు కోరారు. నిన్న రాజమహేంద్రవరంలోని స్థానిక జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, గత మూడు రోజులుగా సంచరిస్తున్న చిరుతపై ప్రజలలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయన్నారు. అటవీ శాఖ అధికారులు 50 మంది సిబ్బందితో 9 బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం కాపలా కాస్తున్నారని చెప్పారు. చిరుతను పట్టుకొని అటవీ ప్రాంతాల్లో వదిలే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

=====================